మరో ఏడు లక్షల ఎకరాలకు నీళ్లు

- తుమ్మిడిహట్టి కట్టి ఎల్లంపల్లికి నీటిని మళ్లిస్తాం
- బరాజ్‌లు రిపేర్ చేసినా నీరు వదిలేయాల్సిందే
- ఎన్‌డీఎస్‌ఏ చెప్పిందిదే: ఉత్తమ్
- అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బరాజ్‌లను పరిశీలించిన మంత్రి

జయశంకర్‌భూపాలపల్లి, జూన్ 7(నమస్తే తెలంగాణ)/మహదేవ్‌పూర్/మంథని రూరల్: తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి తీరుతామని, ఇందుకు అవసరమైన వనరులను సమకూర్చుకుంటామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. శుక్రవారం ఆయన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బరాజ్‌లను పరిశీలించారు. ఎన్‌డీఎస్‌ఏ నిబంధనల ప్రకారం నడుచుకుంటూ బరాజ్‌ల మరమ్మతు, పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని, డే అండ్ నైట్ పనిచేయాలని అధికారులను, సంబంధిత ఏజెన్సీలను మంత్రి ఆదేశించారు. మేడిగడ్డలోని ఎల్‌అండ్‌టీ అతిథి గృహంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రానున్న నాలుగున్నర ఏండ్లలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరు అందేలా ప్రాజెక్టులకు రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా ఏడు లక్షల ఆయకట్టు తీసుకొస్తామని చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించి ఎల్లంపల్లికి నీటిని మళ్లిస్తామని స్పష్టంచేశారు. ప్రస్తుతం అన్నారం, మేడిగడ్డ బరాజ్‌ల మరమ్మతు పనులను ఎల్‌అండ్‌టీ, ఆప్కాన్స్ సంస్థలు చేస్తున్నాయని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ, ఇతర కమిటీల సూచనల మేరకు బరాజ్‌ను ఉపయోగంలోకి తీసుకొచ్చే పనులు జరుగుతున్నప్పటికీ, ఈ రెండు బరాజ్‌ల్లో నీటిని నిల్వ చేసే పరిస్థితి లేదని చెప్పారు. ఈ బరాజ్‌ల నుంచి నీటిని బయటికి వదిలేయాల్సిందేనని స్పష్టంచేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో బరాజ్‌లపై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోయామని, అయినప్పటికీ ఎన్‌డీఎస్‌ఏతో అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ బరాజ్‌లను తనిఖీ చేయించామని తెలిపారు. సుందిళ్ల ప్రాజెక్టు నిర్మాణ పనుల విషయంలో నవయుగ కంపెనీ చాలా

పెద్దపల్లి జిల్లా మంథని మండలం సుందిళ్ల (పార్వతీ)బరాజ్ వద్ద కొనసాగుతున్న పనులు

జాప్యం చేస్తున్నదని, దీనిపై ఆ కంపెనీ ప్రతినిధులను తీవ్రంగా హెచ్చరించామని వెల్లడించారు. అన్నారంలో ఆప్కాన్స్ సంస్థ, మేడిగడ్డలో ఎల్‌అండ్‌టీ సంస్థ పనులు చురుగ్గా చేస్తున్నాయని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం జాతీయహోదా అడుగలేదని, ఈ విషయాన్ని కేంద్ర జలవనరుల శాఖ మంత్రి షెకావత్ చెప్పారని పేర్కొన్నారు. బరాజ్‌ల మరమ్మతు పనులు ఎప్పుడు పూర్తి చేస్తారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నామని దాటవేశారు. ఈఎన్సీ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. రాబోయే వానకాలంలో మూడు బరాజ్‌ల సంరక్షణకు, తర్వాత ఎటువంటి డ్యామేజీ జరగకుండా పనులు చేపట్టామని తెలిపారు. మేడిగడ్డ వద్ద జీఆర్పీ, ఈఆర్టీ పరీక్షలు కొనసాగుతున్నాయని, సీకెంట్ ఫైల్స్ ఫెయిల్యూర్‌పై పరిశీలన జరుగుతున్నదని చెప్పారు. ఎన్‌డీఎస్‌ఏ చెప్పే వరకు గేట్లు ఓపెన్ చేసి పెట్టాలని చెప్పారని అన్నారు. వచ్చే సీజన్‌కు ఎన్‌డీఎస్‌ఏ అనుమతితో రిపేర్లు చేసి మేడిగడ్డ నుంచి పంపింగ్ చేసుకునే అవకాశం ఉన్నదని, వరదలు అయిపోయిన తరువాత జియో ట్యూబ్ వేసి పంప్ చేస్తామని వెల్లడించారు. అన్నారంలో 11 మీటర్లు, సుందిళ్లలో 9 మీటర్ల వద్ద నీటిని ఆపితే ఎల్లంపల్లికి పంప్ చేసుకోవచ్చని అన్నారు. మేడిగడ్డలో బుంగ వాస్తవమేనని, ఫియర్స్ కింద ఇసుక కొట్టుకుపోవడం వల్లే బుంగ ఏర్పడిందని వివరించారు. సుందిళ్ల బరాజ్ వద్ద కొట్టుకుపోయిన ఇసుక పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాబోయే పది రోజుల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, మక్కన్‌సింగ్, లక్ష్మణ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చీఫ్ ఇంజినీర్ సుధాకర్, ఈఈలు యాదగిరి, తిరుపతిరావు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధి సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. పార్వతి బరాజ్ సమీపంలోని పంప్‌హౌస్ సంరక్షణ కోసం నిర్మిస్తున్న కట్ట వల్ల వానకాలంలో తమ ఇండ్లల్లోకి నీరు వస్తున్నదని సిరిపురం గ్రామస్తులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి ఉత్తమ్ స్పందిస్తూ.. స్థానిక మంత్రితో చర్చించి ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారిని ఆదేశించారు.

ఇంజినీరింగ్ ఫీజుల పెంపు?

మొదటిపేజీ తరువాయి...

కాలంలో అఖిలభారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) అనేక మార్పులు చేసింది. ఆయా మార్పులతో పాటు 7వ పే కమిషన్ సిఫారసు ప్రకారం వేతనాలు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ సంఖ్య వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. మార్గదర్శకాల రూపకల్పనపై కూడా సమావేశంలో చర్చించినట్టు తెలిసింది. తమ ప్రతిపాదనలను వినతిపత్రం రూపంలో సమర్పిస్తామని, వాటిని పరిగణనలోకి తీసుకోవాలని కాలేజీల యాజమాన్యాలు కోరినట్టు తెలిసింది.

రేపే గ్రూప్-1 ప్రిలిమ్స్

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు: టీజీపీఎస్‌సీ

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షలకు ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే నిర్వహించనున్నారు. ఇన్‌సర్వీసు ఉద్యోగులు, అభ్యర్థులు కోరినట్టుగా పరీక్షను వాయిదా వేయలేదు. ఈ విషయంలో హైకోర్టు కూడా టీజీపీఎస్‌సీ అధికారులకే నిర్ణయం వదిలేసినట్టు సమాచారం. దీంతో ప్రకటించిన తేదీనే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనెల 9న నిర్వహించనున్న పరీక్ష నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్టు అధికారులు తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 897 పరీక్ష కేంద్రాల్లో 4.03 లక్షలమంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 10 గంటలకే కేంద్రాల గేట్లు మూసివేస్తారు. పది తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించబోమని అధికారులు పేర్కొన్నారు. అభ్యర్థుల హాల్‌టికెట్ల డౌన్‌లోడ్ ప్రక్రియ కొనసాగుతున్నది. పరీక్షలకు సంబంధించిన మార్గదర్శకాలు టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచారు.

దివ్యాంగుల పాఠశాలల్లో దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, జూన్7 (నమస్తే తెలంగాణ): దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ సాధికారతశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బధిర, అంధుల ఆశ్రమపాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈమేరకు శాఖ డైరెక్టర్ శైలజ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. హైదరాబాద్‌లోని మలక్‌పేట, నల్గొండజిల్లా మిర్యాలగూడలోని అవంతిపురం, కరీంనగర్‌లోని బధిరుల ఆశ్రమపాఠశాలల్లో, మహబూబ్‌నగర్, కరీంనగర్ అంధుల ఆశ్రమపాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతివరకు, మహబూబ్‌నగర్ అంధుల ఆశ్రమ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్లు కొనసాగుతున్నాయని వివరించారు. వివరాలకు ఆయా పాఠశాలలను సంప్రదించాలని శైలజ సూచించారు.

మైనార్టీ గురుకులంలో 10న జాబ్‌మేళా

హైదరాబాద్, జూన్7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ఆధ్వర్యంలోని కాలేజీల్లో ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీ, ఎంఎల్‌టీ బ్రిడ్జి కోర్సును పూర్తిచేసిన విద్యార్థులకు ఎంఎస్‌ఎన్ ల్యాబొరేటరీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉద్యోగమేళాను నిర్వహిస్తున్నారు. మైనార్టీ గురుకుల సొసైటీ సెక్రటరీ ఆయేషా మస్రత్‌ఖానం శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఖైరతాబాద్‌లోని మైనార్టీ బాలికల గురుకుల కాలేజీలో ఈనెల 10న ఇంటర్వ్యూలు ఉంటాయని వెల్లడించారు. 55శాతం మార్కులతో పాసైన, 20ఏండ్ల వయస్సులోపు విద్యార్థులు అర్హులని స్పష్టంచేశారు.

ఆందోల్‌కు నర్సింగ్ కాలేజీ

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సొంత నియోజవర్గం ఆందోల్‌కు నర్సింగ్ కాలేజీ మంజూరైంది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డీఎంఈ నుంచి వచ్చిన ప్రతిపాదనలు పరిశీలించిన అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నది. కాలేజీ ఏర్పాటుకు రూ.43 కోట్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపింది.

కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం కేసులో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని ఈ నెల 21 వరకు పొడిగిస్తూ ఢిల్లీలోని రౌస్‌అవెన్యూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో కవితపై సీబీఐ దాఖలు చేసిన అభియోగపత్రాన్ని కోర్టు శుక్రవారం విచారణకు స్వీకరించింది. అనంతరం విచారణను వాయిదా వేసింది. ఇక సీబీఐ దాఖలు చేసిన చార్జిషీటుపై వాదనలు ఉండనున్నాయి. ఇది లాఉండగా జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న తనకు చదువుకోవడానికి 9 పుస్తకాలు కావాలని కవిత కోరగా.. న్యాయస్థానం అనుమతించింది.

ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ అగ్రగామి

- ప్రపంచ దేశాలకు తెలంగాణ బియ్యం ఎగుమతి
- సన్నరకాల సాగు ప్రోత్సాహానికే 500 బోనస్
- గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో మంత్రులు తుమ్మల, ఉత్తమ్

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతను అందిస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన గ్లోబల్ రైస్ సమ్మిట్-2024లో రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదలశాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సదస్సుకు భారత్ సహా ప్రపంచంలోని 30 దేశాలకు చెందిన 250 మంది ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్రంలో నిరుడు వరి సాగు విస్తీర్ణం 12 మిలియన్ ఎకరాలు ఉండగా, 26 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరిగిందని మంత్రులు వివరించారు. స్వాతంత్ర్యానంతరం మన దేశంలో బియ్యం ఉత్పత్తి దాదాపు 8 రెట్లు పెరిగి 14 కోట్ల మెట్రిక్ టన్నులకు

హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్

చేరుకున్నదని చెప్పారు. రాష్ట్రంలో దాదాపు 220 రకాల వరి వంగడాలను రైతులు సాగు చేస్తున్నారని తెలిపారు. వచ్చే సీజన్ నుంచి వరి సన్నరకాలకు ప్రభుత్వం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వనున్నదని తెలిపారు. రాష్ట్రంలోని దాదాపు 30 మిలియన్ల లబ్ధిదారులు ప్రతినెలా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఉచితంగా పొందుతున్నారని వివరించారు. సదస్సులో ఐసీఐ ప్రతినిధి జెరెమీ జ్వింగర్, సలహాదారు అల్దాస్ జానయ్య, ఐఆర్‌ఈఎఫ్ ప్రెసిడెంట్ ప్రేమ్ గార్గ్, టీఆర్‌ఈఏ ప్రెసిడెంట్ కృష్ణారావు,పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్, వ్యవసాయశాఖ కార్యదర్శి ఎం రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వియాట్రిస్‌తో భరోసా సెంటర్ల కీలక ఒప్పందం

- మౌలిక సదుపాయాల కల్పనకు ఎంవోయూ.. 2.5 కోట్ల సీఎస్‌ఆర్ నిధుల కేటాయింపు
- ఒప్పంద పత్రాలు మార్చుకున్న డీజీపీ, వియాట్రిస్ ప్రతినిధులు

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ) : భరోసా, సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ (సీడీఈడబ్ల్యూ) ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లలో మౌలిక వసతులకు గ్లోబల్ హెల్త్‌కేర్ కంపెనీ వియాట్రిస్‌తో రాష్ట్ర పోలీసుశాఖ ఎంవోయూ కుదుర్చుకుంది. శుక్రవారం డీజీపీ కార్యాలయంలోని డీజీపీ రవిగుప్తా, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీజీ శిఖాగోయెల్‌తో కలిసి వియాట్రిస్ సీఎస్‌ఆర్ ఇండియా హెడ్ మిచెల్ డొమినికా ఎంవోయూపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా శిఖాగోయెల్ మాట్లాడుతూ భరోసా కేంద్రాల్లో మౌలిక సదుపాయాల పరిధిని మరింతగా విస్తరించేందుకు ఈ ఎంవోయూ ఓ మైలురాయిగా నిలిచిపోతుందని తెలిపారు. భరోసా, సీడీఈడబ్ల్యూ కేంద్రాల్లో డిజిటల్ ఎక్స్‌పీరియన్స్ థియేటర్, ఎక్స్‌పీరియన్స్ కమ్ లెర్నింగ్ సెంటర్, స్కిల్లింగ్ స్పేస్ తదితర అవసరాలు తీర్చేందుకు వియాట్రిస్ సంస్థ రూ.2.5 కోట్ల సీఎస్‌ఆర్ నిధులను కేటాయించగా రూ.1.5 కోట్ల చెక్కును శిఖాగోయెల్‌కు అందజేశారు.

నలుగురు వ్యవసాయాధికారుల సస్పెన్షన్

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): పచ్చిరొట్ట విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించేందుకు ప్రోత్సహిస్తున్న నలుగురు వ్యవసాయ అధికారులను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులను జారీచేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల వ్యవసాయాధికారితోపాటు మరో ముగ్గురు వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈవో) సస్పెండ్ చేశారు. తొర్రూరు మండలంలో పచ్చి రొట్ట విత్తనాలను బ్లాక్ మార్కెట్ ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలింపుకు కారణమైన తొర్రూరు మండలం వ్యవసాయాధికారి కే సోమకుమార్ యాదవ్, తొర్రూరు క్లస్టర్ గ్రేడ్-2 ఏఈవో ఎం జమున, అమ్మాపురం క్లస్టర్ ఏఈవో అజ్మీరా దీపిక, హరిపిరాల ఏఈవో సీహెచ్ అరవింద్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ గోపి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'స్పెషల్ ఎడ్యుకేషన్'కు డిప్లొమా ఉన్నా అర్హులే

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): రెగ్యులర్ బీఈఈడీ పూర్తిచేసి, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డిప్లొమా చేసినవారు స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టుకు అర్హులేనని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఆర్‌సీఐ మార్గదర్శకాలు, అర్హతల ప్రకారమే నియామకాలుంటాయని తెలిపింది. ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల్లో 220 స్కూల్ అసిస్టెంట్, ప్రాథమిక పాఠశాలల్లో 796 సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తుల గడువు ఈ నెల 20తో ముగియనుంది.

హెల్త్ వర్సిటీ వీసీ పోస్టుకు నోటిఫికేషన్

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): డాక్టర్ కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీ వైస్ చాన్సలర్ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రెండేండ్ల పాటు డీన్ లేదా కనీసం పదేండ్ల పాటు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేసి, 67 ఏండ్ల లోపు వయసున్నవారు ఈ నెల 22 లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించింది.

రేవంత్ హామీ ఉత్తిమాటేనా?

- అంగన్‌వాడీలంటే అంత అలుసా!
- సర్కారును గద్దె దించుతాం
- అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ధర్నా

జూబ్లీహిల్స్, జూన్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తమ సమస్యల ఊసే ఎత్తడం లేదని.. తమను ఉద్ధరిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి మాట ఉత్తిదేనని తేటతెల్లమైందని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ జయలక్ష్మి ధ్వజమెత్తారు. అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెన్‌ఫిట్స్ వర్తింపచేయడంతోపాటు తీవ్రనష్టం కలిగించే రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఉపసంహరించుకోవాలని, జీవో నం.10ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి తరలివచ్చిన అంగన్‌వాడీ సిబ్బందితో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రులు సత్యవతి రాథోడ్,

యూసుఫ్‌గూడలోని తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు.

హరీశ్‌రావు సమక్షంలో అందరికీ ఆమోదయోగ్యమైన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో టీచర్లకు రూ.2 లక్షలు, హెల్పర్లకు రూ. లక్ష, 60 ఏండ్లు దాటినవారికి వీఆర్‌ఎస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ క్రాంతి వెస్లీతో చర్చలు జరిపిన తర్వాత వినతిపత్రం అందజేశారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలి

హైదరాబాద్, (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలుగా పనిచేస్తున్న వేలాది మందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం శుక్రవారం సచివాలయంలో ఐసీడీఎస్ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణను కలిసి వినతిపత్రం అందజేసింది. అనారోగ్య కారణాలతో ఉద్యోగానికి రాజీనామా చేసినవారికీ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. రాష్ట్రంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలుగా నడపాలని, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని, జనాభా ప్రాతిపదికన అదనపు టీచర్లను నియమించాలని, పెండింగ్ ఎరియర్స్, బిల్లులు వెంటనే చెల్లించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి వేదవతి, ఉపాధ్యక్షురాలు అరుణ పాల్గొన్నారు.

యూఆర్‌ఎస్ నాన్‌టీచింగ్ వర్కర్స్ వేతనాలు పెంచండి

ఖైరతాబాద్, జూన్ 7 : కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్స్ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం లక్డీకాపూల్‌లోని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్, అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా నాగయ్య, గీత మాట్లాడుతూ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ వ్యవస్థను వెంటనే రద్దు చేయాలని, కేజీబీవీ, యూఆర్‌ఎస్ నాన్‌టీచింగ్ వర్కర్స్‌కు నెలకు రూ.27వేల వేతనాలు ఇచ్చి పర్మినెంట్ చేయాలని కోరారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అరుణ, కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఖాతా నుంచి 1.40 లక్షలు మాయం

సైబర్ నేరగాళ్ల కొత్తతరహా మోసం

సైదాపూర్, జూన్ 7 : కరీంనగర్ జిల్లా సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ చట్ల ఆంజనేయులు బ్యాంకు ఖాతా నుంచి సైబర్ నేరగాళ్లు రూ.1.40లక్షలు కాజేశారు. వివరాల్లోకెళ్తే.. అంజనేయులు సెల్‌ఫోన్‌కు మే 30న ఆధార్ నెంబర్‌తో సహా ఓటీపీ వచ్చింది. దీనికి కానిస్టేబుల్ బదులు ఇవ్వలేదు. ఆ మరుసటి రోజు అతని సిమ్ కార్డు పనిచేయకపోగా కస్టమర్ కేర్‌కు ఫోన్ చేశాడు. దీంతో అతని నెంబర్ బ్లాక్ అయిందని వారు సమాచారం ఇచ్చారు. తిరిగి కొత్త సిమ్‌కు దరఖాస్తు చేసుకోగా ఈ నెల 5న కొత్త సిమ్ వచ్చింది. దానిని ఫోన్‌లో వేసుకుని చూసుకోగా, అతని బ్యాంకు ఖాతాలో రూ.1.93 లక్షలకు బదులు రూ.50 వేల నగదు మాత్రమే ఉన్నది. ఇదేంటని బ్యాంక్‌కు వెళ్లి అడగ్గా, మే 31 నుంచి జూన్ 5 వరకు రూ.1.40 లక్షలు డ్రా చేసుకున్నట్టు బ్యాంకు అధికారులు వివరాలు అందజేశారు. దీంతో మోసపోయానని గ్రహించి ఆంజనేయులు సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడు.

ట్రాన్స్‌జెండర్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

సిటీబ్యూరో, జూన్ 7 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో తొమ్మిదో తరగతి నుంచి ఆ పై చదివే ట్రాన్స్‌జెండర్స్ 'ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ట్రాన్స్‌జెండర్స్ 2024-25'కి ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ గిగ్ వర్కర్స్ యూనియన్ సంస్థ ఫౌండర్ షేక్ సలావుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనో పేర్కొన్నారు. గత ఏడాది తరగతిలో 50 శాతం మార్కులు ఉండి, వార్షిక ఆదాయం ఏడాదికి రూ.లక్ష మించి ఉండనివారికి స్కాలర్‌షిప్ రూ.40వేల వరకు అందించనున్నట్టు చెప్పారు. సమాచారం కోసం సెల్ నంబర్ 96424 24799 సంప్రదించాలని సూచించారు.

'బయోమెడికల్ సైన్స్'లో ఏడాదిపాటు ఇంటర్న్‌షిప్

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): 'బీఎస్సీ బయోమెడికల్ సైన్స్' పేరుతో నాలుగేండ్ల ఆనర్స్ డిగ్రీని ఈ విద్యాసంవత్సరంలో రాష్ట్రంలోని 15 కాలేజీల్లో ప్రవేశపెట్టారు. ఒక్కో కాలేజీలో 50 సీట్ల చొప్పున 750సీట్లకు అనుమతిచ్చారు. దోస్త్ రెండో విడుతలో ఈ సీట్లను భర్తీచేస్తారు. శుక్రవారం మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ లింబాద్రి, వైస్ చైర్మన్ మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్ ఈ కోర్సు సిలబస్‌ను విడుదల చేశారు. ఈ కోర్సు నిర్వహణకు దవాఖానలు, బయో ఫార్మాసూటికల్స్ కంపెనీలతో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ కోర్సును దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో ప్రవేశపెట్టినట్టు తెలిపారు. ఈ కోర్సుతో జీనోమ్ వ్యాలీలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

టాపర్ల చూపు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల వైపు

- నిజాం కాలేజీ, మహిళావర్సిటీ సీట్లకు డిమాండ్
- సర్కారు కాలేజీల్లోనే అత్యధికులు
- ప్రైవేట్ కాలేజీల్లో సీట్లన్నీ ఖాళీ

హైదరాబాద్, జూన్ 7 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది ఇంటర్ టాపర్లంతా ఇంజినీరింగ్, మెడికల్ వంటి కోర్సులను కాదనుకుని డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు పొందారు. వీరంతా ప్రైవేట్ కాలేజీలను కాదని ప్రభుత్వ కాలేజీల్లో చేరుతుండటం విశేషం. ముఖ్యంగా నిజాం కాలేజీ, తెలంగాణ వర్సిటీ (కోఠి మహిళా కాలేజీ)ల్లో డిగ్రీ సీట్లు హాట్‌కేకులను తలపిస్తున్నాయి. సికింద్రాబాద్ పీజీ కాలేజీ, బేగంపేట మహిళా డిగ్రీ కాలేజీ, సిటీ కాలేజీల్లోని డిగ్రీ సీట్లకు డిమాండ్ తీవ్రంగా ఉంది.

44 శాతం సర్కారు కాలేజీల్లోనే..

ఈ ఏడాది అడ్మిషన్లు పొందిన వారిలో 44శాతం విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోనే చేరారు. దోస్త్ మొదటి విడుతలో 76,290 విద్యార్థులు అడ్మిషన్లు పొందితే 34,170 మంది ప్రభుత్వ కాలేజీల్లో చేరారు. అదే ప్రైవేట్ కాలేజీల్లో 42,120 మంది (56శాతం) అడ్మిషన్లు పొందారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు155కి పైగా ఉండగా, ప్రైవేట్ కాలేజీలు 731 ఉన్నాయి. ఇన్‌టేక్ సీట్ల సంఖ్య సైతం ప్రైవేట్ కాలేజీల్లోనే అధికం. ముఖ్యంగా యూనివర్సిటీ అటానమస్ కాలేజీల్లోని సీట్లలో 71శాతం మొదటి విడుతలోనే భర్తీ అయ్యాయి. రైల్వే డిగ్రీ కాలేజీలో 100శాతం సీట్లు నిండటం విశేషం. అదే ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లోని సీట్లలో కేవలం 22శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.

- రాష్ట్రంలో 731 ప్రైవేట్ డిగ్రీ కాల